వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైసీపీ పూజలు

విశాలాంధ్ర - రాంబిల్లి : తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ప్రసాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ఆరోపణలకు నిరసనగా వైఎస్ఆర్సీపీ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలకి పార్టీ పిలుపునిచ్చింది. దీనిలో భాగంగా రాంబిల్లిలో వెంకటేశ్వర స్వామి ఆలయం లో శనివారం పూజా కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు గారు, ఎంపీపీ శిరీష శీను బాబు గారు, మండల పార్టీ అధ్యక్షుడు కిషోర్ రాజు, మండల సచివాలయం కన్వీనర్ కోవూరి రామకృష్ణ గారు వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఇల్లు నిర్మించుకోకపోతే ఇళ్ల స్థలం రద్దు

విశాలాంధ్ర - పాయకరావుపేట : ప్రభుత్వం ద్వారా ఇళ్ల స్థలం పొందిన లబ్ధిదారులందరూ వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి లచ్చన్న కోరారు. మన ఇల్లు మన గౌరవం కార్యక్రమం మండలంలోని పలు గ్రామాల్లో జరిగింది. ఈ సందర్భంగా పి.ఎల్. పురం జగనన్న లేఔట్‌లో జరిగిన కార్యక్రమంలో లచ్చన్న మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోకపోతే ఇళ్ల స్థలాలు రద్దు అవుతాయి అని తెలిపారు. అంతేకాక ఇళ్ల స్థలం పొందినట్లుగా ఆన్ లైన్ పేరు ఉండడం వలన మరోసారి ఇళ్ల స్థలం పొందే అవకాశం ఉండదని తెలిపారు. లబ్ధిదారులు సమస్య ఏదైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ పి.విజయుడు, ఏఈ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర - ఎలమంచిలి : పట్నంలోని రైల్వే స్టేషన్ రోడ్డు ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం వింగ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎం. ఆనంద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల లోనే విద్యార్థులకు అత్యుత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని, మరింతమంది దాతలు విద్యార్థులకు అన్ని విధాల సహాయ పడాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భవాని, ఉపాధ్యాయులు నాగేశ్వరావు, పద్మావతి, సింగ్, భవాని తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ ఆశయాలతో ప్రభుత్వాన్ని నడపాలి : డివైఎఫ్ఐ

విశాలాంధ్ర - రాంబిల్లి : భగత్ సింగ్ అతి చిన్న వయసులోనే మన భారత దేశ స్వతంత్రం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడని కొనియాడారు. శనివారం నాడు డివైఎఫ్ఐ మండల కార్యదర్శి నాగ మంత్రి నారాయణ రావు, మాజీ డివైఎఫ్ఐ నాయకులు జి.దేవుడు నాయుడులు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నా దేహం ముక్కలైనా కానీ ఈ దేశాన్ని ముక్కలు కానివ్వనని నినదించారని అన్నారు. అలాంటిది నేడు మన రాష్ట్రంలో అనేక సమస్యలతో ప్రజలు అల్లాడుతుంటే అధికార ప్రతిపక్ష నాయకులు తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూలో అనేక పదార్థాలు కలిసి అపవిత్రమైందని పెద్ద ఎత్తున మత మతవైషమ్యాలు రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ఈ రాష్ట్రంలో ప్రధాన పార్టీల నాయకులు బిజెపి ఉచ్చులో పడి మతవైషమ్యాలు రెచ్చగొట్టి అసలు పరిపాలన పక్కన పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టి లడ్డు కల్తీ వ్యవహారం సిట్ దర్యాప్తు సంస్థకు వదిలిపెట్టాలని, భగత్ సింగ్ ఆశయాలు కోసం పనిచేస్తున్నామని చెప్పిన నాయకులు ఈ విధమైన చర్యలకు పాల్పడడం చాలా ఆందోళనకరమని అన్నారు. భగత్ సింగ్ ఆశయాలు సాధించడం అంటే అన్ని మతాలను గౌరవించడమని ప్రజల సమస్యలపై దృష్టి పెట్టి పనిచేయడం అని దోపిడీ లేని సమాజం కోసం పనిచేయడమేనన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ధోని కాసియా, సిహెచ్ గంగరాజు, సిహెచ్ అప్పలరాజు, పి.శ్రీను, చిన్న, నాగేష్, నర్సింగ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

డిక్లరేషన్ ఇచ్చేందుకు ఆహం ఎందుకు జగన్ : బుద్ధ నాగ జగదీష్

విశాలాంధ్ర -అనకాపల్లి : 2019 - 24 మధ్య జగన్ రెడ్డి పరిపాలనలో తిరుమలలో జరిగిన ఘోరాలు, అపచారాలు, అవినీతి కార్యక్రమాలు అన్ని ఇన్ని కావని, మహామేత రాజశేఖర్ రెడ్డి హయాంలో జరిగిన అపచారాలకు మించిన స్థాయిలో జగన్ రెడ్డి అండ్ కో కార్యక్రమాలు జరిగాయని మాజీ శాసన మండలి సభ్యులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు జగన్ రెడ్డి పై విరుచుకుపడ్డారు. నిన్న తిరుమలలో స్వామి వారి దర్శించుకునేందుకు వెళ్లేందుకు నిర్ణయించుకొని రద్దు చేసుకుని విలేకరుల సమావేశంలో మతం మానవత్వం గురించి మాట్లాడుతుంటే దెయ్యాల వేదాల వల్లించిన చందంగా ఉందని నాగ జగదీష్ అన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని ముఖ్యమంత్రి హోదాలో తిరుమలలో నిబంధనలను తుంగలో తొక్కి స్వామివారికి పట్టు వస్త్రాలు సతీసమేతంగా ఇవ్వవలసిన సాంప్రదాయాన్ని మంటగలిపి, అన్య మతస్తులు స్వామివారి దర్శించుకునే డిక్లరేషన్ ఇవ్వకుండా అధికార యంత్రాంగం పై హుకుం జారీ చేసి స్వామి వారి దర్శనానికి వెళ్లే వారిని నాగ జగదీష్ అన్నారు.

భారతదేశంలో గొప్ప వ్యక్తులలో రాష్ట్రపతి చేసిన అబ్దుల్ కలాం ముస్లిం మతస్థుడైనప్పటికీ స్వామి వారికి డిక్లరేషన్ ఇచ్చి స్వామి పై నమ్మకంతో దర్శించుకున్నారని, కాంగ్రెస్ అధినేత సోనియా గాంధీ, జమ్మూ కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫారుక్ అబ్దుల్లా స్వామి వారికి డిక్లరేషన్ ఇచ్చి వెళ్లారని వారి కంటే గొప్ప వ్యక్తిగా జగన్ రెడ్డి ఊహించుకొని కులం మతం మానవత్వం గొప్ప గొప్ప పదాలు చెప్తున్నారని, తాను ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు మానవత్వం మరిచిపోయి రాజధానికి భూములు ఇచ్చిన రైతులను మహిళలను పోలీసులతో నానా హింసలు పెట్టి ఎస్సీ ఎస్టీ కేసులు పెట్టి వేధించిన విషయం మరిచిపోయరని, భగవంతునిపై నమ్మకంతో అమరావతి రైతులు స్వామి వారి దగ్గరికి, కనకదుర్గమ్మ దర్శనానికి వెళ్ళనివ్వకుండా వారిని వేధించిన విషయం మర్చిపోయారని, దళితులపై ప్రేమతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వారి సంక్షేమ పథకాలు 27 పథకాలు రద్దుచేసి ఐదు సంవత్సరాలు వారికి సంక్షేమాన్ని అందకుండా చేసిన వ్యక్తి దళితుల గురించి మాట్లాడే అర్హత ఉందా అని నాగ జగదీష్ జగన్ రెడ్డిని ప్రశ్నించారు. మరోపక్క మాజీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి జగన్ రెడ్డి తిరుమలలో ప్రార్థనలు చేయడానికి వెళుతున్నారని అడ్డుకోవడం భావ్యమా అని మాట్లాడుతున్న వ్యక్తికి ప్రార్థనలకు, భజనలకు, దర్శనానికి తేడా తెలియకుండా ఉన్మాదుల మాట్లాడుతున్నారని నాగ జగదీష్ కరుణాకర్ రెడ్డిని ఎద్దేవా చేశారు. మాటిమాటికి జగన్ రెడ్డి చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని, చెప్పడం చూస్తుంటే వింతగా ఉందని, మీ అబద్ధాలను ప్రజలు నమ్మలేదు కాబట్టి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పి 11 సీట్లు ఇచ్చి నిన్ను శాసనసభ్యులుగా మిగిల్చారని, ఇప్పుడైనా ప్రభుత్వానికి సహకరించి వైయస్సార్సీపి అధ్యక్షుడిగా ప్రభుత్వానికి సూచనలు సలహాలు ఉంటే ఇవ్వండి, లేకపోతే గతంలో మీరు చేసిన అవినీతి అక్రమాలు దోపిడీలు అరాచకాలుపై చట్టం తన పని తాను చేసుకుపోతుందని నాగ జగదీష్ అన్నారు.

రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన సదస్సులు

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శని వారం అనకాపల్లి కలెక్టరేట్లోని సమావేశ హాల్లో జిల్లాస్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వ హించాలన్నారు. బ్లాక్ స్పాట్లలో లైటింగ్, బోర్డ్, సిగ్నల్ లాంటివి ఏర్పాటు చేయడం జరిగిందని ఇంకా ఎక్కడైనా చేయవలసిన అవసరముంటే ఇందుకోసం ప్రతిపాదనలు పంపించాలన్నారు. ప్రమాదాలు జరిగే చోట ఇక్కడ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలపాలని, సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాలు పని చేసేలా చర్యలు తీసుకోవాలని, దాని ఫీడ్ పోలీస్‌కి అవసరం అయినప్పుడు ఇవ్వాలని తెలిపారు. జాతీయ రహ దారులపై ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ హైవేఅధికారులు, ట్రాన్స్పోర్ట్ అధికారులు, ఆర్అండ్‌బి అధికారులతో కలిసి లంకెలపాలెం, నక్కపల్లి జంక్షన్ లను జాయింట్ ఇన్స్పెక్షన్ చేయమని ఆదేశించారు. జిల్లా రవాణా అధికారి మనోహర్ మాట్లాడుతూ. రోడ్డు ప్రమాదాలను ఎక్కువ జరుగుతున్న రోడ్లను జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి నివేదిక అందిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో, పిడిఆర్‌డిఏ సచిదేవి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీధర్, పోలీస్ డిపార్ట్మెంట్, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

అధికారులను నిలదీసిన హౌసింగ్ లబ్ధిదారులు

విశాలాంధ్ర - కే.కోటపాడు : ఈ మండలం కొరువాడ గ్రామం వైయస్సార్ జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్ లబ్ధిదారులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు మండల ప్రత్యేక అధికారి ఇ.నాగలక్ష్మి. డిప్యూటీ తాసిల్దార్ రమేష్. హౌసింగ్ ఏఈ అధికారులు పాల్గొన్నారు. వైయస్సార్ జగనన్న కాలనీలో 27 మంది లబ్ధిదారులు బేస్మెంట్ లేవెల్‌లో ఇళ్ల నిర్మాణం చేపట్టారని , నాలుగిల్లు నేటికీ ఎటువంటి పనులు చేపట్టలేదని. వీటిని మార్చి నెల ఆఖరులాగా పూర్తి చేయకపోతే హౌసింగ్ స్కీమ్ రద్దయిపోతుందని చెప్పడంతో లబ్ధిదారులందరూ అధికారులతో గొడవ పడ్డారు. అగనంపూడి ఇసుక రీచ్ నుండి ఇసుక తీసుకురావాలంటే పదివేల రూపాయలు ఖర్చు అవుతుంది. బ్లాక్ లో కొనుక్కుంటే 4000 రూపాయలు ఖర్చు అవుతుంది. ప్రభుత్వం ఫ్రీగా ఇసుక ఇస్తామని చెప్పి నేటికీ ఇసుక సరఫరా చేయకుండా ఇల్లులు ఎలా నిర్మాణం చేయగలమని అన్నారు ఒక దశ లో మండల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి ని నిలదీయడం జరిగింది.ఈ విషయం తక్షణమే ఎమ్మెల్యేతో కలెక్టర్ తో మాట్లాడి ఇసుక అందుబాటులో తెచ్చే విధంగా ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఎప్పుడు ఇస్తారో ఖచ్చితంగా సమాధానం చెప్పాలని. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే గోవిందరావు డిమాండ్ చేయడంతో. అధికారులు బిక్కమొఖం వేసుకొని వెనకదిరిగారు . మూడు కుటుంబాలకి పట్టా ఇచ్చిన భూమిలో విద్యుత్ ఎల్టి లైన్ ఉండడం వల్ల ఇల్లు నిర్మాణం పనులు ప్రారంభంచలేదని. గతంలో అనేక మంది అధికారులుకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని అన్నారు.. గత ప్రభుత్వం మండలంలో తొమ్మిది పంచాయతీలకు కలిపి కోరువాడ రెవిన్యూ పరిధిలోజగనన్న కాలనీ ఇచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం కొరువాడ గ్రామస్తులకు పట్టాలవ్వాలని. ఇతర గ్రామాల వారు వస్తే అడ్డుకుంటామని స్పెషల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమానికి 8 గ్రామాల నుండి లబ్ధిదారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఆటలపోటీలకు గుడివాడ విద్యార్థుల

విశాలాంధ్ర - యస్.రాయవరం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలలో మండలంలో గుడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పీడీ కుందూరురాజు వెల్లడించారు. పాఠశాల ప్రధానో పాధ్యాయులు నాగన్న దొర ఆధ్వర్యంలో పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వీరిని అభినందించారు. బాలుర విభాగంలో ఐదుగురు బాలికల విభాగంలో ముగ్గురు విద్యార్థులు షటిల్ బాడ్మింటన్, కబడ్డీ పోటీలలో ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉజ్వల భవిష్యత్ కు క్రీడలు ఎంతో ఉపయోగం అని, క్రీడలు ద్వారా శారీరక దృఢత్వం తో పాటు,, ఉద్యోగావకాశాలు ఎక్కువ ఉంటాయని తెలియజేసారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడలలో తర్ఫీదు నిచ్చిన వ్యాయామఉపాధ్యాయుడు కుందూరు రాజును ఉపాధ్యాయులు, జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్, మహేశ్వరీ, సుధాలక్ష్మి, శ్రీదేవి, భవాని, తదితరులు పాల్గొన్నారు.

మారేడుపూడిలో మన ఇల్లు ..మన గౌరవం

విశాలాంధ్ర - అనకాపల్లి : మండలంలో మారేడుపూడి లేఅవుట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఇల్లు మన గౌరవం కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పాల్గొని అక్కడికి వచ్చిన లబ్ధిదారులకు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. లబ్ధిదారులు తమ సమ స్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. నీరు, వీధిలైట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతునట్లు తెలిపారు. విద్యుత్ మోటారు పనిచేయకపోవడం వలన నీరు అందడం లేదని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. పైన తెలిపిన కారణాల దృష్ట్యా తాము ఇల్లు కొట్టుకోలేకపోతున్నం అని తెలిపారు. సమస్యలను పరిష్కరిస్తే ఇళ్ల నిర్మాస్తామని తెలిపారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులకు సమస్యలను ఒక వారంలో పరిష్కరించమని ఆదేశించారు. లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, రెవెన్యూ డివిజన్ అధికారి చిన్నికృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బూడిని కలిసిన మాడుగుల నియోజకవర్గం వైఎస్ఆర్ పార్టీ శ్రేణులు

విశాలాంధ్ర - దేవరాపల్లి : అనకాపల్లి జిల్లా వైఎస్సార్ సిపి పార్టీ అధ్యక్షుడు గా నియమితులైన మాజీ మంత్రి బూడి ముత్యాల నాయుడు ను మాడుగుల నియోజకవర్గం నాలుగు మండల పార్టీ పెద్దలు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు శనివారం తారువ గ్రామంలో ముత్యాల నాయుడు కలిసి శాలువాలతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు.

గంజాయి కేసులో ముద్దాయి అరెస్ట్

విశాలాంధ్ర - నక్కపల్లి : క్రైమ్ నెంబర్ 269/2023 గంజాయి కేసులో ముద్దాయిగా ఉన్న రోలుగుంట మండలం బీబీపట్నం గ్రామానికి చెందిన ఎ రాజులనాయుడు తప్పించుకుని తిరుగుతూ నక్కపల్లి మండలంలో తిరుగుతున్నట్లు స్థానిక సీఐ కుమార స్వామికి సమాచారం రావడంతో ఎస్సై సన్నీ బాబు సిబ్బంది చాకచక్యంగా పట్టుకొని అరెస్ట్ చేశారు. అరెస్టు చేసిన ఆ వ్యక్తిని రిమాండుకు పంపినట్లు సీఐ కుమారస్వామి తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - పరవాడ : ఎన్టీపీసీ కాంటాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం ఎన్టీపీసీ మెయిన్ గేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ కాంటాక్ట్ కార్మికులకు సంస్థ లోగోతో కూడిన ఐడి కార్డులు ఇవ్వాలని, ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లు మారినా కార్మికుల తొలగింపులు వేధింపులు చేయరాదన్నారు. వైద్య పరీక్షల పేరుతో కార్మికుల అక్రమ తొలగింపులకు యాజమాన్యం పాల్పడం దుర్మార్గమన్నారు. వేధింపులను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. కొంతమంది కాంట్రాక్టర్లు జీతాలు బకాయిలు పెట్టి కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీనిపై యాజమాన్యం స్పందించకపోవడం అన్యాయమని మండిపడ్డారు. ఎన్టీపీసీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్టీపీసీ యాజమాన్యం కాంటాక్ట్ కార్మికులతో అధిక పనులు చేయించుకొని డబల్ ఓటి ఇవ్వకుండా సింగిల్ ఓటి మాత్రమే ఇస్తున్నారని, కొన్ని చోట్ల ఓటి కూడా చెల్లించడం లేదని ఆరోపించారు. చట్ట ప్రకారం ఇవ్వవలసిన పిఎఫ్, ఈఎస్ఐ, బోనస్, సెలవులు, గ్రాట్యుటి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఐసిహెచ్ క్యాంటీన్లో కాంటాక్ట్ కార్మికులకు, పర్మినెంట్ ఉద్యోగులకు ఒకే రకమైన ఆహారం పెట్టి అందరినీ ఒకేలా చూడాలని కోరారు. మహారత్న పరిశ్రమలో కార్మికులను వివక్షతతో చూడడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో గోవిందరాజ్, నాయుడు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ ఏడీగా నరేష్

విశాలాంధ్ర - కోటవురట్ల : మండల పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా డాక్టర్ నరేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శనివారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఏడిగా పదవి బాధ్యతలు చేపట్టిన డాక్టర్ నరేష్‌కి మండల తెదేపా అధ్యక్షులు జానకి శ్రీనివాసరావు, జనరల్ సెక్రెటరీ లింగం నాయుడు, సుంకర బాబ్జి, సత్యనారాయణ, యేసు, పెట్ల నరేష్, కోల రమేష్ తదితరులు పూలమాలలు వేసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. పశు వైద్య అధికారులు సిబ్బంది కూడా డాక్టర్ నరేష్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం దారులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలని అందించి వారి అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు.

ఎంఎస్ఎంఈ చైర్మన్ శివశంకర్‌కు శుభాకాంక్షలు

జనసేన నియోజకవర్గ ఇంఛార్జ్ రాజాన వీర సూర్యచంద్ర

విశాలాంధ్ర - గొలుగొండ : ఎంఎస్ఎంఈ చైర్మన్‌గా విశాఖపట్నంలో బాధ్యతలు చేపట్టిన శివశంకర కు నర్సీపట్నం నియోజవర్గ జనసేన పార్టీ నాయకులు శనివారం శుభాకాంక్షలు తెలియజేశారు. జనసేన పార్టీ అధినేత రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎంత ప్రతిష్టాత్మకమైన ఎంఎస్ఎంఈ చైర్మన్ పదవి శివశంకర్కు అప్పగించడం అని నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జి రాజాన వీర సూర్యచంద్ర అన్నారు ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంలో ఉన్న నాయకులు అందరికీ కూడా ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు రేగుబల్ల సాంబమూర్తి (శివ) గొలుగొండ మండల జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గండెం దొరబాబు, సలాదుల ప్రసాదు. మండల ఉపాధ్యక్షులు దుంగల రమేష్, స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీలను ప్రారంభించిన డిప్యూటీ డీఈవో

విశాలాంధ్ర - రావికమతం : నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలను డిప్యూటీ డిఇఓ అప్పారావు ప్రారంభించారు. స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో నిర్వహించిన ఈ పోటీలలో 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజవర్గంలో 4 మండల స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు చోడవరం లో శనివారం నియోజవర్గ స్థాయి పోటీలలో పాల్గొంటారని ముందుగా ప్రకటించారు. చోడవరం హై స్కూల్ గ్రౌండ్ మొత్తం వర్షపు నీటితో నిండి పోటీలకు అనుకూలంగా లేకపోవడంతో ఈ పోటీలను రావికమతం జిల్లా పరిషత్ హై స్కూల్లో నిర్వహించాలని నిర్ణయించారు. మండల స్థాయిలో గెలిచిన అండర్ 14, 17 బాలురు కబడ్డీ ఖో ఖో బ్యాడ్మింటన్, చదరంగం తదితర విభా గాల పోటీలలో పాల్గొన్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 120 మంది క్రీడాకారులను జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలో వివిధ పాఠ శాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరావు, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మణరావులు క్రీడా పోటీలకు అవసరమైన సౌకర్యాలను కల్పించారు.

అన్న సమారాధన ప్రారంభించిన నాగ జగదీష్

విశాలాంధ్ర - అనకాపల్లి : శ్రీ గణపతి మహారాజ్ మహోత్సవ సందర్భంగా వెంకుపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆధ్వర్యంలో శ్రీ సిద్ధి వినాయక సేవా సంఘం సెలబ్రేట్స్ బాయ్స్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుచున్న కార్యక్రమానికి మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ముందుగా వినాయకుడిని దర్శించుకుని ప్రసాదం స్వీకరించిన అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నాగ జగదీష్ చేతులు మీదగా ప్రారంభించారు. నాగ జగదీష్ మాట్లాడుతూ. ప్రతి ఏటా గణపతి నవరాత్ర మహోత్సవ సందర్భంగా రైతాంగం యువతీ యువకులు గణపతి ఉత్సవాలు నిర్వహిస్తూ ఈ ప్రాంత ప్రజలకు భారీ ఎత్తున ప్రతి ఏటా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించడం అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని నాగ జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం ప్రచార కార్యదర్శి కాండ్రేగుల సత్యనారాయణ వెంకుపాలెం టిడిపి నాయకులు దొడ్డి సూరిబాబు ఆదారి నారాయణరావు మల్ల కన్నమనాయుడు బొడ్డేడ ఉదయ భాస్కర్ పోలమరశెట్టి అప్పలస్వామి నాయుడు బుద్ధ శంకర్రావు దాడి సత్యనారాయణ ఆదారి గణేష్ సెలబ్రిటీ బాయ్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చీడిగుమ్మలలో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమం

విశాలాంధ్ర - గొలుగొండ : మండలంలో చీడిగుమ్మల జగనన్న కాలనీలో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో భాగంగా లబ్ధి దారులతో అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి సుర్ల వెంకట గిరిబాబు మాట్లాడుతూ మండలంలో ఉన్న జగనన్న కాలనీలు అన్నింటిలోనూ అప్రోచ్ రోడ్లు వాటర్ ట్యాంకులు డ్రైనేజీలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు అదేవిధంగా గత ప్రభుత్వ హాయంలో పెండింగ్ బిల్లులు ఉండు పైన లబ్ధిదారులకు వెంటనే బిల్లులు చెల్లించాలా తగు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ అధికారులను కోరారు స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ ఈ విషయాలు ఎన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని లబ్ధిదారుల సమక్షంలో హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

విశాలాంధ్ర - కశింకోట : మండలంలోని ఎన్జీ పాలెం పాల కేంద్రం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. కశింకోట సీఐ అల్లు స్వామినాయుడు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎలమంచిలి మండలం సైకిల్ పాలెం గ్రామానికి చెందిన పెంటకోట సాయి (23) ద్విచక్ర వాహనంపై తాళ్లపాలెం నుండి ఎలమంచిలి వైపు వెళుతుండగా ఎన్జీపాలెం వద్ద లారీ నెంబర్ ఓడి 33 ఏబి 4147 నెంబర్ గల లారీ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుండి బలంగా ఢీకొనడంతో సాయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సాయికి తండ్రి మాణిక్యం తల్లి పార్వతి ఒక సోదరి ఉన్నారు. సాయి మృతదేహాన్ని పోలీసులు స్థానిక ఎన్టీఆర్ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో మృతుడు తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. కశింకోట ఎస్సై మనోజ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి వేడుకలు

విశాలాంధ్ర - నక్కపల్లి : మండలంలో పెదబో దుగల్లం హైస్కూలులో శనివారం నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా హెచ్.ఎమ్. చోడిశెట్టి సత్య నారాయణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ జాషువా చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించి తెలుగు సాహిత్యంలో జాషువా చేసిన కృషిని వివరించారు. జాషువా సామాజిక దృక్పథంతో రచనలు చేశా రన్నారు. తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్. ఆచార్యులు మాట్లాడుతూ సమాజంలో మూఢాచారాలపై తన రచనల ద్వారా నిరసించి చైతన్యం కలిగించిన గొప్ప దార్శనిక కవి జాషువా అన్నారు.తెలుగు సాహితీ లోకంలో ఆయనొక దిగ్గజ కవి అన్నారు. ఆయనకున్న తన అపారమైన జ్ఞానంతో చేసిన రచనలు నేడు సామాజిక జీవనంలో అందరికీ ఆదర్శనీయంగా నిలిచాయన్నారు. ఆయన రాసిన గబ్బిలం ప్రజల్లో విశేషాదరణ పొందిందన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.ఫల్గుణరావు, ఎ.వి.ఎల్.ఎన్.ఎన్. కుమారి, చిన్నారావు, శ్రీదేవి, రమేష్ బాబు తదితరులు జాషువా చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు.

తిరుపతి లడ్డును అపవిత్రం చేశారు : ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్

విశాలాంధ్ర - పాయకరావుపేట : తిరుపతి లడ్డును అపవిత్రం చేశారని ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ ఆరోపించారు. తిరుపతి లడ్డు అపవిత్రం జరిగినందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా శివదత్ పాయకరావుపేట పాండురంగ స్వామి దేవస్థానం నుంచి నక్కపల్లి మండలం, ఉపమాక దేవస్థానం వరకు 20 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శివదత్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వింత పోకడతో మతాల మధ్య చిచ్చుపెట్టె విధంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. తిరుపతి లడ్డు విషయంపై ప్రశ్నించింది ఒక హిందువని, కుల, మతాల మధ్య చిచ్చుపెట్టే

అంశం ఎంత మాత్రం కాదన్నారు. మన మతాలను ప్రేమించాలి, పరమతాలను గౌరవించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎప్పుడూ చెబుతూ ఉంటారని శివదత్ తెలిపారు. ప్రతి విషయంలోనూ ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్యాయంపై ప్రశ్నించే మనస్తత్వం పవన్ కళ్యాణ్ ది అన్నారు. గత ప్రభుత్వం అపవిత్రం చేసిన లడ్డు పవిత్రతను కాపాడుకోవాలని ఒక భారతీయునిగా, హిందువుగా పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేస్తున్నారని తెలిపారు. పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు గత 11 రోజులుగా రాష్ట్రంలో అన్ని ప్రాంతాల నుంచి సంఘీభావం తెలియజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, చింతకాయల రాంబాబు, ఆకేటి గోవిందరావు, చించలపు ప్రదీప్, పులగపూరి అప్పలనర్స, కశింకోట సత్తిబాబు, పల్లా విలియం కేరి, జూరెడ్డి ప్రసాద్, రాజా రమేష్, ఇంజరపు సూరిబాబు, ఐఎన్ మూర్తి, కువల కుమార్, వేములపూడి అప్పారావు, పలువురు జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు శివదత్ పాదయాత్రకు సంఘీభావం తెలిపారు.